## క్లుప్తంగా

### టిడ్కో డైరెక్టర్‌కు శుభాకాంక్షలు



వెంకటరమణను సన్మానిస్తున్న టిడ్కో డైరెక్టర్ గోవిందరావు, గ్రామస్తులు

బూర్జ: టిడ్కో డైరెక్టర్‌గా మండలంలోని మదనాపురం గ్రామానికి చెందిన ఖండాపు గోవిందరావు (వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు)ను ప్రభుత్వం ఇటీవల నియమించింది. బుధవారం గోవిందరావు ఇంటికి సమితి మాజీ అధ్యక్షుడు, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సిరిపురపు వెంకటరమణ వచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. సంతకవిటి మండలం వంజరాం గ్రామానికి చెందిన సిరిపురపు వెంకటరమణను గోవిందరావు, కుటుంబ సభ్యులు, గ్రామ నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖండాపు నవీన్, డసీసీబీ డైరెక్టర్ వావిలపల్లి గోవిందరావు, పెద్దపేట ఉపసర్పంచ్ డి.వి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### కొత్తూరు తహసీల్దార్‌గా చక్రవర్తి



విధుల్లో చేరిన చక్రవర్తి

కొత్తూరు: కొత్తూరు తహసీల్దార్‌గా పూర్తి అదనపు బాధ్యతలతో ఎం.చక్రవర్తిని జిల్లా కలెక్టర్ ఈ నెల ఒకటో తేదిన నియమించారు. చక్రవర్తి బుధవారం విధుల్లో చేరారు. చక్రవర్తి జిల్లా సివిల్ సప్లయ్ కార్యాలయంలో ఉప తహసీల్దార్ పనిచేశారు. ఇంత వరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ పి.బాలను జిల్లా కలెక్టరేట్‌లో ల్యాండ్ రిఫార్మ్స్ ఏఓగా డిప్యుటేషన్‌పై నియమించారు.

### రాయితీపై వరి విత్తనాలు



ఏఓ ధానకర్ణుడు

మెళియాపుట్టి: ప్రభుత్వం 90 శాతం రాయితీపై అందిస్తున్న వరి విత్తనాలను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ ధానకర్ణుడు బుధవారం తెలిపారు. మెళియాపుట్టి రైతు భరోసా కేంద్రంలో మాట్లాడుతూ..ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు విత్తనాలు అందిస్తున్నామన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, పది శాతం రైతు వాటా చెల్లించాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు స్వర్ణ, ఇంద్ర, అమర, శ్రీధృతి, శ్రీకాకుళం సన్నాలు తదితర రకాల విత్తనాలు అందిస్తామన్నారు.

### చిరుజల్లులు..



మెళియాపుట్టిలో దట్టమైన మేఘం

మెళియాపుట్టి: రోజంతా ఉక్కపోతతో ఇక్కట్లు పడిన మండల ప్రజలకు బుధవారం సాయంత్రం ఒక్కసారిగా మేఘావృతమై చిరుజల్లులు కురిశాయి. భానుడి ప్రతాపం నుంచి ఉపశమనం లభించింది. గురువారం నుంచి రోహిణీ కార్తెలు ప్రారంభం కానున్నాయి.

### నేడు స్పీకర్ పర్యటన

పొందూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల నిర్మించిన రహదారులను స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నరసాపురం, భగవాన్‌దాస్‌పేట, ఎరుకలపేట గ్రామాల్లో ఇటీవల నిర్మించిన రహదారులను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బూర్జ: మండలంలోని కొల్లివలస సబ్‌స్టేషన్ మరమ్మతు పనులు గురువారం నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ జి.అప్పన్న బుధవారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గుత్తావల్లి, లాభాం, మామిడివలస, కంట్లాం, చీడివలస, ఉప్పినివలస, కొల్లివలస, లచ్చయ్యపేట, ఓ.వి.పేట, కొరగాం, తోటవాడ, అయ్యవారిపేట, అన్నంపేట, తిమడాం, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తామన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

### ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

కొత్తూరు: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని సంతకవిటికి చెందిన ప్రముఖ ప్రవచనకర్త యాలాల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని హంస గ్రామంలో భాగవతం–శివపురాణంపై ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం బుధవారం రాత్రి ప్రారంభించారు. శివనామస్మరణం చేయడం వల్ల కష్టాలు తొలుగుతాయన్నారు. ఇటువంటి కార్యక్రమాలు ద్వారా ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలన్నారు. టీటీడీ ఆధ్యాత్మిక మండలి మండల కన్వీనర్ పొగిరి రవి, హంస గ్రామస్తులు పాల్గొన్నారు.

# నీలమ్మా.. చల్లగా చూడమ్మా..

- అంబరాన్ని అంటిన నీలమణి సంబరం
- కన్నుల పండువగా పట్టాజంగిడి ఉత్సవం
- పట్టా జంగిడిని దర్శించుకున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- భారీగా తరలివచ్చిన భక్తులు



పట్టాజంగిడెను దర్శించుకున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



అమ్మవారికి పూజలు చేస్తున్న కిల్లి కృపారాణి



ఆకుట్టుకున్న వేషధారణలు



పాతపట్నం ప్రధాన రహదారిలో పట్టా జంగిడి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



తప్పెటగుళ్ల కళాకారుల ప్రదర్శన

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత నీలమణి దుర్గ అమ్మవారి పెద్ద పండగల్లో ప్రధాన సంబరం బుధవారం ప్రారంభమైంది. పట్టాజంగిడతో అమ్మవారిని ఊర్లోకి ఆహ్వానించే మహోత్సవం వైభవంగా జరిగింది. పిన్నింటి కుటుంబ సభ్యులు పట్టాజంగిడి గ్రామంలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి ముందుగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజల్లో చేపట్టారు. పట్టా జంగిడిని దర్శించుకున్నారు.

**సంప్రదాయబద్ధంగా..**

సంప్రదాయబద్ధంగా అమ్మవారిని ఊర్లోకి ఆహ్వానించే శుభ ఘడియలు సాయంత్రం 4 గంటల సమయంలో కాపువీధి నుంచి ప్రారంభమయ్యాయి. భారీ ఊరేగింపు మధ్య పట్టాజంగిడితో గ్రామస్తులు అమ్మవారిగుడికి చేరుకున్నారు. పూజలు నిర్వహించిన సమయంలో అమ్మవారి కుడిచేతి వైపు ఉన్న పుష్పం పట్టాజంగిడిలో పడుతుంది. దీంతో అమ్మవారి కటాక్షం లభించిందని భావించి పట్టా జంగిడితో పిన్నింటి కుటుంబీకులు కదలివస్తారు. మహిళలు పావడాలతో ఆహ్వానిస్తారు. కాపువీధికి వచ్చేసరి అమ్మవారికి మహిళలు దిష్టితీసి ప్రత్యేక ఆలయంలోకి ఆహ్వానించారు. ప్రత్యేకపూజలు నిర్వహించి అమ్మవారిని కొలువు ఉంచారు.

**ఆకుట్టుకున్న ప్రదర్శనలు**

వివిధ కళా ప్రదర్శనలు ప్రజలను ఆకుట్టుకున్నాయి. తప్పెటగుళ్ల ప్రదర్శన, తూర్పుగోదావరి జిల్లా మార్టేరు నుంచి వచ్చిన కళాకారుల కనకదుర్గ వేషధారణలు, ఏలూరు వారు చేసిన ప్రత్యేక వేషధారణలు, అరకుకు చెందిన దింసా నృత్యం ప్రదర్శన అందర్నీ ఆకుట్టుకున్నాయి.

**అమ్మవారిని దర్శించుకున్న కృపారాణి..**

నీలమణిదుర్గ అమ్మవారిని మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఈఓ వాసుదేవరావు ఆహ్వానం పలికారు. జెడ్పీటీసీ లింగాల ఉషారాణి, ఉత్సవ హెడ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో పారదర్శక పాలన



తొగిరిలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

సారవకోట: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పారదర్శక పాలనను అందజేస్తున్నారని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని కిన్నెరవాడ సచివాలయ పరిధి తొగిరి, తద్రవానిపేట గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి ప్రతాలను అందజేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఉన్న సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తద్రవానిపేటలో మురుగు నీటి కాలువలు నిర్మించాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. వీటిపై ప్రతిపాదనలు తయారు చేయాలని ఎంపీడీఓ విశ్వేశ్వరరావుకు ఎమ్మెల్యే ఆదేశించారు. తొగిరి గ్రామంలో విద్యుత్ స్తంభాలు అవసరమని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, సర్పంచ్‌లు చల్లా తాతయ్య, కోరుకొండ శంకరబాబు, పార్టీ నాయకులు వరుదు దేవి ప్రసాద్, చల్లా జోగారావు, మట్ట జగన్, నక్క తులసీదాస్, రావాడ శ్రీనివాసరావు, యాళ్ల శ్యామసుందరరావు, నిక్కు కృష్ణారావు, కడుసు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞాన శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

- జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శంకరరావు



విద్యార్థులతో ముచ్చటిస్తున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శంకరరావు

హిరమండలం: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.వి.జి.ఎస్.శంకరరావు కోరారు. హిరమండలంశాఖా గ్రంథాలయాన్ని బుధవారం సందర్శించారు. గ్రంథాలయ నిర్వాహణ రికార్డులు పరిశీలించారు. విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు అనే తేడా లేకుండా అందరూ గ్రంథాలయాలకు రావచ్చునని, ఇక్కడ ఉండే మంచి పుస్తకాలను చదివి జ్ఞానం పెంచుకోవాలని తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు విజ్ఞానం, వినోదం పంచడమే లక్ష్యంగా వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రంథాలయంలో మరుగుదొడ్లు లేక పాఠకులు ఇబ్బందులు పడుతున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి దృష్టికి గ్రంథాలయ అధికారి కె.ఎర్రమ్మ తీసుకువచ్చారు. ఈ సమస్యపై ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# వలంటీర్ల సేవలు దేశానికే ఆదర్శం



జలుమూరు: వలంటీర్లతో ధర్మాన పద్మప్రియ, వైఎస్సార్‌సీపీ నాయకులు



నరసన్నపేట: చోడవరంలో సత్కారం పొందిన వలంటీర్లతో వైఎస్సార్‌సీపీ నాయకులు



సారవకోట: బద్రిలో వలంటీర్లను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



నరసన్నపేట: సత్కారం పొందిన వలంటీర్లతో ధర్మాన కృష్ణచైతన్య, వైఎస్సార్‌సీపీ నాయకులు



కొత్తూరు: నివగాంలో వలంటీర్లను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జలుమూరు: వలంటీర్ల సంక్షేమ సారథులని, ఎటువంటి సిఫార్సులు లేకుండా ప్రతీ లబ్ధిదారునికి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించి, గొప్ప సేవా భావంతో ముందుకు వెళ్తున్న మీరు నిజమైన సమాజ సేవకులని వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ అన్నారు. పర్లాం, అంధవరం, సైరిగాం, అల్లాడ సచివాలయాల్లో బుధవారం వలంటీర్లను సన్మానించారు. ఎంపీపీ వాన గోపి, అల్లాడ సొసైటీ అధ్యక్షుడు ఎం.శ్యామలరావు, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు ఎం.అరుణమ్మ, సర్పంచ్‌లు అసిరమ్మ, తాడేల త్రినాథరావు, ధర్మాన అనిత, మండల సలహాదారుడు పైడి విఠలరావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు కనుసు సీతారాం, అల్లాడ సొసైటీ మాజీ అధ్యక్షుడు పి.ముసలి నాయుడు, పార్టీ నాయకులు రేగాన శ్యామ్, వెలమల అసిరినాయుడు, ధర్మాన రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

**మరింత బాధ్యతగా పనిచేయాలి**

నరసన్నపేట: ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందిస్తున్న వలంటీర్లు మరింత బాధ్యతగా పనిచేయాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు అన్నారు. మండలంలోని చోడవరం, తెలగవలస, చెన్నాపురం, చిక్కాలవలస సచివాలయాల పరిధిలో వలంటీర్లకు బుధవారం సత్కార కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీడీఓ బి.మధుసూదనరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు సురంగి నర్సింగరావు, రాజాపు అప్పన్న, అంపోలు సుధ, ఎ.సూర్యనారాయణ, సడగాన రవి తదితరులు పాల్గొన్నారు.

**వలంటీర్లకు వందనం..**

సారవకోట: మండలంలోని గుమ్మపాడు, బద్రి, కిన్నెరవాడ సచివాలయాల పరిధిలోని పనిచేస్తున్న వలంటీర్లకు బుధవారం ప్రశంసపత్రాలు అందించి సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ విశ్వేశ్వరరావు, బద్రి ఎంపీటీసీ మెండ బాలచంద్రరావు నాయుడు, సర్పంచ్ బాడాన కృష్ణారావు, పంచిరెడ్డి పద్మావతి, చల్లా తాతయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు బమ్మిడి నాగరాజు, కత్తిరి అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శులు మురళి, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

**వలంటీర్లకు సత్కారం..**

కొత్తూరు: మండలంలోని నివగాం సచివాయం పరిధిలోని గ్రామ వలంటీర్లకు గ్రామ సచివాలయంలో సచివాలయ కన్వీనర్లు టంకాల రమణరావు, రాడ రాజు బుధవారం సత్కరించారు. గ్రామ వలంటీర్ల సేలను ప్రశంసించారు. గ్రామ కార్యదర్శి వెంకటలక్ష్మి, వీఆర్వో రాజగోపాలరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. మాకవరం సచివాలయం పరిధిలోని వలంటీర్లకు సచివాలయ కన్వీనర్ గార రాజులు నాయుడు ఘనంగా సత్కరించారు.

**నరసన్నపేటలో..**

నరసన్నపేట: నరసన్నపేటలో వలంటీర్లను పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య బుధవారం సాయంత్రం సత్కరించారు. ఎంపీపీ ఆరంగి మురళి, సర్పంచ్ బూరల్లి శంకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

# పాఠ్య పుస్తకాల పంపిణీకి చర్యలు



హిరమండలం: స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ రాంబాబు



నరసన్నపేట: మండలానికి వచ్చిన బుక్స్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ, సీఆర్పీలు

హిరమండలం: ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ మొదటి వారంలోనే అన్ని పాఠశాలలకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఎంఈఓ కె.రాంబాబు తెలిపారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యా కానుకల స్టాక్ పాయింట్‌కు రెండో దశ పాఠ్యపుస్తకాలు బుధవారం చేరాయన్నారు. వాటి పరిశీలించారు. ఇప్పటివరకు దాదాపు 80 శాతం మేర జగనన్న విద్యా కానుకలకు సంబంధించిన వస్తువులు వచ్చాయన్నారు. మిగిలినవి వారం రోజుల్లో వస్తాయన్నారు. మొదట విడతగా 11,169 పాఠ్యపుస్తకాలు, రాగా రెండో విడతగా 9,645 పాఠ్య పుస్తకాలు వచ్చాయన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం రోజున విద్యార్థులందరకీ జగనన్న విద్యాకానుక కిట్లు అందజేయడం జరుగుతుందన్నారు. హెచ్‌ఎం యు.ఎస్ ఎన్.మూర్తి, ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.

**మండలానికి చేరిన రెండో విడత పాఠ్యపుస్తకాలు**

నరసన్నపేట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అవసరాలకు వీలుగా పాఠ్య పుస్తకాలు పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే మొదటి విడతలో 9 వేల బుక్స్ రాగా.. బుధవారం మరో 7 వేల బుక్స్ వచ్చాయి. ఇప్పటివరకు 16774 పుస్తకాలు వచ్చినట్లు ఎంఈఓ శాంతారావు తెలిపారు. మరో 15 వేల పుస్తకాలు రావాల్సి ఉందన్నారు. మరో వారంలోగా ఈ పుస్తకాలు వచ్చే అవకాశం ఉందని, వీటిని జూన్ మొదటి వారంలో స్కూళ్లకు తరలించి, పాఠశాలల ప్రారంభం నాటికే బుక్స్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# సీఎం జగన్ కృషి అభినందనీయం



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: కేంద్రం నుంచి నిధులు తెప్పించడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అమోఘమని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ అన్నారు. ఆమదాలవలస పట్టణంలో గల జగనన్న ప్రజా సేవా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2014–15 ఆర్థిక సంవత్సరంలోటు బడ్జెట్ నిధులు రూ.10,461 కోట్లు తెప్పించడంలో సీఎం జగన్ ఎనలేని కృషి చేశారన్నారు. విభజన చట్టం హామీ ప్రకారం 2014–15 ఆర్థిక లోటు బడ్జెట్ సుమారు రూ.16000 కోట్లు కాగా, అప్పట్లో చంద్రబాబు హయాంలో రూ.4 వేల కోట్లు విడుదల చేశారన్నారు. తరువాత ఎన్‌డీఏ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంటూ మిగతా నిధులు చంద్రబాబు తెప్పించులేకపోయారన్నారు. నేడు సీఎం జగన్ తన దార్శనికతతో నిధులు తేగాలిగారన్నారు. సీఎం జగన్ ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో చర్చిస్తూ, సత్సంబంధాలు కొనసాగిస్తున్నారన్నారు. చంద్రబాబు తన హయంలో 29 సార్లు ఢిల్లీ వెళ్లినా రాష్ట్రానికి ఒక్క ప్రయోజనం కూడా కలగలేదని, సొంత ప్రయోజనాలే అజెండాగా వెళ్లేవారన్నారు. రాష్ట్రానికి నిధులు వస్తే అభినందించాల్సింది పోయి.. టీడీపీ నాయకులు నీచ రాజకీయాలు చేస్తున్నారన్నారు. అన్నెపు కృష్ణ, రుప్ప దుర్గారావు, బుడుమూరు రామ్మోహన్, బొడ్డేపల్లి శ్రీనివాసరావు, చింతాడ రాఘవేంద్రరావు, సంతోష్ పాల్గొన్నారు.

### అందుబాటులో లేని ఆస్పత్రి సిబ్బంది

- పాముకాటు బాధితుడిని శ్రీకాకుళం తరలింపు

పొందూరు: మండలంలోని గోకర్ణపల్లి పంచాయతీలోని రంగనాథపేటకు చెందిన బి.పారయ్య బుధవారం రాత్రి పాము కాటుకు గురయ్యాడు. వెంటనే 108కు సమాచారం ఇవ్వడంతో సంతకవిటి మండలానికి చెందిన వాహనం రంగనాథపేటకు చేరింది. వాహనంలో పొందూరు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి రాత్రి 8 గంటలకు చేరుకున్నారు. ఆ సమయంలో ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది లేరు. ఆస్పత్రిలో ఎంఎల్‌ఓ మాత్రమే ఉన్నాడు. పాముకాటుకు గురైన పారయ్యకు ఇంజక్షన్ చేసేందుకు, ఆక్సిజన్ పెట్టడానికి, సెలైన్ పెట్టడానికి సిబ్బంది ఎవరూ అందుబాటులో లేరు. విధుల్లో ఉండాల్సిన స్టాఫ్ నర్సు రిలీవర్ వచ్చేంతవరకు ఉండకుండా వెళ్లిపోయారు. సమయం గడుస్తున్న కొద్దీ పరిస్థితి విషమయంగా మారుతుండటంతో తప్పినిసరి పరిస్థితుల్లో అదే 108లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. దీనిపై ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ రామదాస్‌ను వివరణ కోరగా.. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### • రహదారి ప్రారంభం



రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఉత్సవాల నేపథ్యంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయంగా బూరగాం నుంచి పర్లాకిమిడికి నిర్మించిన రహదారిని మహేంద్రతనయ నది వద్ద ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అమ్మవారి ఉత్సవాలకు పాతపట్నంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఉండడానికి బూరగాం, నీలకంఠేశ్వర ఆలయం మీదుగా పర్లాకిమిడి(ఒడిశా)కి దారి మళ్లింపు చేయనున్నామన్నారు. కలెక్టర్‌తో మాట్లాడి రూ.10 లక్షల ప్రత్యేక నిధులు కేటాంచామని పీఆర్ డీఈఈ ఆర్.ఎస్.ప్రసాద్ తెలిపారు. పీఆర్ జేఈ టి.ప్రసాద్, ఉత్సవ కమిటీ సభ్యులు ఎల్.వి.మధు, ఎల్.రవికుమార్, కాళ్ల రాజు, నూలు బుజ్జి, ఎస్.ప్రదీప్, డి.నారాయణమూర్తి, జోగారావు, యరకయ్య, నూలు ఈశ్వరరావు, బూరగాం, కాగువాడ సర్పంచ్‌లు బిజిలి పుల్లాయ్, నల్లి రాజారావు, ప్రహల్లాద పుల్లాయ్, శిర్ల జోగారావు, ఉమామహేశ్వరరావు, ఎం.తాతయ్య, పనుకు మోహన్, జి.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

### 108లో ప్రసవం



శిశువును చూపిస్తున్న 108 సిబ్బంది

పాతపట్నం: మండలంలోని చిన్నమల్లిపురం గ్రామానికి చెందిన పి.గౌతమి 108లో ప్రసవించింది. మంగళవారం అర్ధరాత్రి పురిటినొప్పులు రావడంతో గౌతమి కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందజేశారు. సిబ్బంది సకాలంలో చిన్నమల్లిపురం చేరుకుని వాహనంలో గంగువాడ పీహెచ్‌సీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో నొప్పులు ఎక్కువయ్యాయి. 108 వాహనం పక్కకు నిలిపి.. వైద్యులు పూర్ణిమ, మెడికల్ టెక్నిషియన్ వి,రామకృష్ణ, ఆశ వర్కర్ ఆదమ్మ, పైలెట్ గోపాలకృష్ణ వైద్య అందించారు. ఆడ శిశువు పుట్టింది. అనంతరం గంగువాడ పీహెచ్‌సీలో తల్లీబిడ్డలను చేర్పించారు. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారని 108 సిబ్బంది తెలిపారు.

# ఫ్యామిలీ డాక్టర్ పేదలకు వరం



హిరమండలం: దాసుమానుగూడలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి సాయిగీత

హిరమండలం: గ్రామీణుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పేదలకు వరమని హిరమండలం, చొర్లంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు సి.హెచ్.సాయిగీత, సి.హెచ్.మౌనిక అన్నారు. మండలంలోని హిరమండలం పీహెచ్‌సీ పరిధిలో దాసుమానుగూడ, చొర్లంగి పీహెచ్‌సీ పరిధిలో తంపలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. 179 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు అందించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

**104 సేవలను సద్వినియోగం చేసుకోవాలి**

పొందూరు: గ్రామాల్లో 104 వాహనం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ లక్ష్మీతులసీ అన్నారు. మండలంలోని కోటిపల్లి పంచాయతీలో బుధవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, మంచం పట్టిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. వైద్యాధికారి శివశంకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.